# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 28 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమవుతుంది.**
2. **భారత్ లో ఎయిర్ క్రాఫ్ట్ ల తయారీకి బ్రెజిల్ తో కీలక ఒప్పందం కుదిరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**
3. **ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద బీసీలకు 20 వేల రూపాయల అదనపు రాయితీ అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.**
4. **తెలంగాణాలోని ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతర ఈ రోజు నుంచి ప్రారంభంకానుంది.**

-----------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ రోజు జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో రాజధాని అమరావతికి 4 వేల 450 కోట్ల రుణం, రాజధానికి భూములిచ్చిన రైతులకు స్థలాల కేటాయింపు, ప్రభుత్వ పథకాల అమలు, పురోగతి

వంటి అంశాలపై మంత్రివర్గ  సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-----------------------

రాజకీయ పాలనలో పార్లమెంట్ కమిటీలు కీలకమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ  కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ కమిటీల కార్యశాలలో  ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు.పార్లమెంట్ పరిధిలో చేపట్టే  కార్యక్రమాల్లో పార్లమెంట్ అధ్యక్షులతో స్థానిక శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రి సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

-----------------------

భారత్ లో ఎయిర్ క్రాఫ్ట్ ల తయారీకి  బ్రెజిల్ తో  కీలక ఒప్పందం కుదిరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.  అదానీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్,  బ్రెజిల్ కు చెందిన ఎంబ్రియెర్ సంస్థలు కేంద్ర మంత్రి సమక్షంలో ఢిల్లీలో నిన్న అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అనంతరం  రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ప్రాంతీయ రవాణా విమాన వ్యవస్థకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. దేశీయంగా  భాగాల తయారీ, నిర్వహణ, మరమ్మతు, సమగ్ర పరిశీలన -ఎంఆర్ఓ సేవల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

-----------------------

బంగ్లాదేశ్‌లోని జైలు నుంచి 23 మంది భారతీయ మత్స్యకారులు నిన్న విడుదలయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంకు చెందిన 9మంది మత్స్యకారులు ఉన్నారని అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ హోం మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి మహమ్మద్ అఫీజ్ ఆల్ అసాద్, భారత డిప్యూటీ హై కమిషనర్ ఇతర అధికారుల సమక్షంలో మత్స్యకారులను విడుదల చేశారు. బాగర్హాట్ జైల్ నుంచి విడుద చేసిన తర్వాత మధ్య మోంగ్లా నౌకాశ్రయానికి మత్స్యకారులను తరలించారు. బంగ్లాదేశ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న భారత జాలర్ల పడవల మరమ్మతు పనులు పూర్తి చేసిన అనంతరం రేపు అక్కడి నుంచి బయల్దేరనున్నారని అధికారులు తెలిపారు.

-----------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద వెనుకబడిన తరగతులు బీసీలకు 20 వేల రూపాయల అదనపు రాయితీ అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో ఆమె నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలకు 34శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ల కల్పనపై చర్చించామన్నారు. బీసీల కోసం ఆదరణ 3 పథకాన్ని అమలు చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 22 సెకన్లు

-----------------------

వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా దేశంలోని తీరప్రాంతాల రాష్ట్రాల్లో కోస్టల్ సైక్లోథాన్–2026 ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి  నిత్యానంద్ రాయ్  న్యూఢిల్లీ లోని మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్–2026' ను ఈరోజు ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో జాతీయ ఐక్యత, ఆరోగ్యంపై అవగాహన, దేశభక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ సైక్లోథాన్ ను నిర్వహిస్తోంది

ఈ సైక్లోథాన్ ఈరోజు నుంచి ఒకేసారి రెండు దిశల్లో ప్రారంభమవుతుంది. తూర్పు తీరంలో పశ్చిమ బెంగాల్‌లోని బక్కాఖాలి నుంచి, పశ్చిమ తీరంలో గుజరాత్‌లోని లఖ్‌పత్ కోట నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమై, వచ్చే నెల ఫిబ్రవరి 21న కేరళ రాష్ట్రంలోని కొచ్చి వద్ద ముగియనుంది.  సైక్లోథాన్ కార్యక్రమం తూర్పు తీరంలో  ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం నుంచి వచ్చే నెల 5వ తేదీన ప్రారంభం కానుంది.

----------------------

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన తెలంగాణాలోని  ములుగు జిల్లా  మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈ రోజు నుంచి ప్రారంభంకానుంది.  31 వరకు జరగనున్న ఈ జాతరలో  కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క గద్దెలపై కొలువుదీరుతారు.  ఈ నెల 31న దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తులకోసం  తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీకి అనుగుణంగా

క్యూలైన్లను జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. జాతర కోసం టిజియస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది.

----------------------

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం వేదికగా 'వింగ్స్ ఇండియా 2026' విమానాల ప్రదర్శన ఈ రోజు నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెల 31 వరకు 4 రోజులు పాటు జరగనున్న ఈ ప్రదర్శనను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తో పాటు పలువురు పాల్గొంటారు. "భారత విమానయానం భవిష్యత్తును సుగమం చేస్తోంది" అనే ఇతివృత్తంతో జరిగే ఈ కార్యక్రమంలో దేశ, అంతర్జాతీయ విమాన రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయి. విమానాలు, హెలీకాప్టర్ల ప్రదర్శనతోపాటు భారత వైమానిక దళానికి చెందిన ఏరోబాటిక్ బృందం ప్రదర్శన, ఫ్లైయింగ్ అండ్ ఏరోబాటిక్ ప్రదర్శనలు జరగనున్నాయి.

----------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, "పంజాబ్ కేసరి" బిరుదాంకితుడు.. లాల్, బాల్, పాల్ త్రయంలో ఒకరుగా పేరు తెచ్చుకున్న లాలా లజపతి రాయ్ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1865వ సంవత్సరం జనవరి 28వ తేదీన పంజాబ్ రాష్ట్రం దుడికే గ్రామంలో జన్మించిన ఆయన.. స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన యోధుల్లో ఒకరుగా చిరస్థాయిలో నిలిచారు.

----------------------

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ అన్నారు. విజయవాడలోని స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో నిర్వహించిన ఆటోల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు.

----------------------

తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమగాలులు వీస్తుండడంతో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్లో చలి తీవ్రత తగ్గి రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని , రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది.

ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణిలో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

= = = = = = = = = = = = = = = = =